# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/









## గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతల బాహాబాహీ..

- కిందపడిన ఫిరోజ్‌ఖాన్
- ప్రోటోకాల్ విషయంలో ఫిరోజ్ ఖాన్, ఉస్మాన్ అల్ హజ్రీ మధ్య ఘర్షణ
- అజారుద్దీన్ పక్కన కూర్చునే అంశంలో వివాదం
- అడ్డుకునేందుకు ప్రయత్నించిన వీహెచ్‌ను నెట్టివేసే యత్నం
- ఇది తమ ఫ్యామిలీ విషయమన్న ఫిరోజ్ ఖాన్



# మహానాడులో చరిత్రాత్మక తీర్మానం

- ఇచ్చిన హామీలు మరిచిన చరిత్ర నీది.. జగన్‌పై మంత్రి నిమ్మల
- న్యాయవాది మొయినుద్దీన్ హత్యకేసులో కీలక పరిణామం
- తొలి రోజు ముగిసిన మహానాడు.. పార్టీకి వెల్లువెత్తిన విరాళాలు
- నేడు పండ్ల కోసం వెళ్లి.. ముగ్గురు చిన్నారుల మృతి
- విజయవాడలో 'సూపర్ ప్రెషర్ బెలూన్' ప్రయోగం
- రిజిస్ట్రేషన్ల రద్దీ తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు..
- ఐపీఎల్ 2026: ఎలిమినేటర్ మ్యాచ్‌లో టాస్ నెగ్గిన హైదరాబాద్
- అలా చేస్తే ఎన్నికల నుంచి తప్పుకుంటారా? కేటీఆర్‌కు పొంగులేటి
- 'కరుప్పు' సినిమా పిటిషన్ కొట్టివేత
- అందుకే మీది గొడ్డలి పార్టీ: లోకేశ్

అమరావతి: తెలుగుదేశం పార్టీ మహానాడు తొలిరోజు కార్యక్రమం అత్యంత విజయవంతమైందని ఏపీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధినేత చంద్రబాబు తెలిపారు. ప్రపంచ పరిస్థితుల దృష్ట్యా ఈసారి హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించిన మహానాడుకు విశేష స్పందన లభించిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. తొలిరోజే సుమారు 7.50 లక్షల మంది వర్చువల్‌గా హాజరై పసుపు పండుగను జయప్రదం చేశారని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో స్పందించారు.ఏటా ఒకేచోట జరిగే మహానాడును ఈసారి 1,875 క్లస్టర్లకు విస్తరించామని



# డీకేఎస్‌కే పట్టం

- నేడు కర్ణాటక సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా
- తొలుత మంత్రులు, ఎమ్మెల్యేలకు అల్పాహార విందు
- అనంతరం నేరుగా లోక్‌భవన్‌కు వెళ్లి రాజీనామా సమర్పణ
- అనంతరం సీఎల్పీ భేటీలో నూతన సీఎం ఎంపిక
- 30న శివకుమార్ ప్రమాణ స్వీకారం?

బెంగళూరు: కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు జాతీయస్థాయిలో ఒక్కసారిగా చర్చనీయాంశంగా మారాయి. గత కొన్ని నెలలుగా ఉత్కంఠభరితంగా మారిన ముఖ్యమంత్రి మార్పు అంశం ఒక కొలిక్కి వచ్చింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి గురువారం రాజీనామా చేయనున్నారు.



## ప్రజల కోసం ప్రశ్నించే ఏకైక సింహం జగన్: కొడాలి నాని

- జగన్ నేతృత్వంలో వైసీపీ కీలక సమావేశం
- చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాలను ప్రజలంతా గమనిస్తున్నారన్న కొడాలి నాని
- వెన్నుపోటుకు రెండేళ్లు పేరుతో నిరసన కార్యక్రమాలు చేపట్టబోతున్నామన్న పేర్ని నాని

వైసీపీ అధినేత జగన్ నేతృత్వంలో పార్టీ కీలక సమావేశం జరిగింది. అనంతరం మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని మీడియాతో...


## బండి భగీరథ్‌కు మేడ్చల్ లో వైద్య పరీక్షలు

- భగీరథ్ కు మూడు రోజుల పోలీస్ కస్టడీ
- కీలక ఆధారాల సేకరణే లక్ష్యంగా పోలీసుల విచారణ
- కట్టుదిట్టమైన భద్రత మధ్య వైద్య పరీక్షలు
- మేడ్చల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలింపు

**మేడ్చల్, :-27 (నేటి ప్రస్థానం):** రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టిస్తున్న పోక్సో కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటూ, ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నిందితుడు బండి భగీరథ్‌కు కోర్టు మూడు రోజుల పోలీస్ కస్టడీ విధించింది. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన



# పేల్చి పడేస్తాం..



## మిత్ర దేశానికి ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్ డీసీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తమ మిత్రదేశమైన ఒమన్‌కు మాస్ వార్నింగ్ ఇచ్చారు. ఒకవేళ హార్ముజ్ విషయంలో ఒమన్ గనుక ఇరాన్‌కు మద్దతుగా నిలిస్తే ఆ దేశాన్ని పేల్చి పడేస్తాం అని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యవహారశైలి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం



# కల్లాల వద్ద దైన్యంగా రైతులు

## పంటల కొనుగోలు లేక దీనావస్థ

- వారిని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి
- బీఆర్ఎస్ శ్రేణులు రైతులకు అండగా నిలవాలి
- పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ పిలుపు

హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా అనేక వ్యవసాయ మార్కెట్ యార్డులు,

# మహారాష్ట్ర సీఎంకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ


- తుమ్మిడిహట్టిపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామన్న రేవంత్ రెడ్డి
- చర్చల కోసం సమయమివ్వాలని లేఖలో విజ్ఞప్తి
- ఎఫ్ఆర్ఎల్ పెరిగినా మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువ ఉంటుందని వెల్లడి

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ అంశంపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆ లేఖలో పేర్కొన్నారు. చర్చల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులకు సమయం ఇవ్వాలని, సమావేశానికి తేదీని ఖరారు చేయాలని విజ్ఞప్తి చేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్‌కు మహారాష్ట్ర ప్రభుత్వం గతంలో అంగీకరించిందని గుర్తు చేశారు. కానీ దీంతో ఉత్తర తెలంగాణ నీటి అవసరాలు తీరవని పేర్కొన్నారు. ఎఫ్ఆర్ఎల్ పెరిగితేనే గ్రావిటీ ద్వారా తెలంగాణకు నీళ్లు వస్తాయని తెలిపారు. ఎఫ్ఆర్ఎల్ పెంచినా మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువగానే ఉంటుందని పేర్కొన్నారు.



## జూన్ 12న బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించనున్న సీఎం

- తెలంగాణలో ఇంటర్ విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ మెనూ
- మెనూలో బోండా, దోశ, పూరీ, మిల్లెట్ ఇడ్లీ, ఉప్మా
- ఫలహారాలలోకి చట్నీ, సాంబార్, మిక్స్డ్ వెజిటేబుల్ కుర్మా



# భారత్, అమెరికా 'ఖనిజ' బంధం

- అరుదైన, కీలకమైన ఖనిజాల సరఫరాలో పరస్పర సహకారం
- చరిత్రాత్మక ఒప్పందంపై సంతకాలు చేసిన ఇరుదేశాలు

న్యూఢిల్లీ: అరుదైన, కీలకమైన ఖనిజాల సరఫరాలో పరస్పర సహకారమే లక్ష్యంగా భారత్, అమెరికాలు చరిత్రాత్మక ఒప్పందం కుదుర్చుకున్నాయి.

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..

## గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతల బాహాబాహీ..

కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం రసాభాసగా మారింది. మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ముందే నేతలు ఫిరోజ్ ఖాన్, ఉస్మాన్ అల్ హజ్రీ ఘర్షణపడ్డారు. ఉస్మాన్ నెట్టివేయడంతో ఫిరోజ్ ఖాన్ కిందపడ్డారు. ప్రోటోకాల్ విషయంలో వీరి మధ్య గొడవ జరిగింది. అజారుద్దీన్ పక్కన కూర్చునే అంశంలో వివాదం చెలరేగింది. ఈ క్రమంలో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. ఇద్దరి మధ్య ఘర్షణను అడ్డుకునేందుకు సీనియర్ నేత వి. హనుమంతరావు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఆయనను కూడా నెట్టివేసేలా వారి తీరు ఉండటంతో మిగిలిన వారు అడ్డుకున్నారు. ఈ పరిణామంతో అజారుద్దీన్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమావేశం ముగిసినట్లు పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.

**గొడవపై స్పందించిన ఫిరోజ్ ఖాన్** కుర్చీ విషయంలో చిన్న మిస్ అండర్‌స్టాండింగ్ వల్ల గొడవ జరిగిందని ఫిరోజ్ ఖాన్ తెలిపారు. మంత్రి పక్కన కూర్చోవాలని అందరూ అనుకున్నారని పేర్కొన్నారు. ఉస్మాన్ తనకు పెద్దన్నలాంటివాడని పేర్కొన్నారు. ఇది తమ కుటుంబ విషయమని స్పష్టం చేశారు.

## డీకేఎస్‌కే పట్టం

ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించనున్నారు. కాంగ్రెస్ అధిష్టానంతో మంగళవారం సుదీర్ఘంగా జరిగిన చర్చల అనంతరం సిద్ధరామయ్య పదవి నుంచి తప్పుకోవడానికి అంగీకరించిన సంగతి తెలిసిందే. ఢిల్లీలో వరుస సమావేశాల అనంతరం మంగళవారం రాత్రి బెంగళూరుకు తిరిగివచ్చారు. బుధవారం మీడియా సమావేశం నిర్వహించి తన రాజీనామాను ప్రకటిస్తారని వార్తలొచ్చాయి. కానీ, మీడియా సమావేశాన్ని గురువారానికి వాయిదా వేసుకున్నారు. చివరిసారిగా ముఖ్యమంత్రి హోదాలో తన సహచర మంత్రులు, ఎమ్మెల్యేలకు గురువారం ఉదయం 8.45 గంటలకు అల్పాహార విందు ఇవ్వబోతున్నారు. అనంతరం 10.30 గంటలకు లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌కు తన రాజీనామా లేఖను అందిస్తారు. సీఎం రాజీనామా తర్వాత కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం జరగనుంది. ఈ భేటీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్, కర్ణాటక కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి రణదీప్ సుర్జేవాలా కూడా పాల్గొంటారు. పార్టీ హైకమాండ్ తీర్మానాన్ని ఎమ్మెల్యేలకు వివరించనున్నారు. నూతన శాసనసభాపక్ష నేతను ఎన్నుకుంటారు. అధిష్టానం సూచనల మేరకు ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్‌ను సీఎల్పీ నాయకుడిగా ఎన్నుకోనున్నట్లు సమాచారం. సీఎల్పీ ఆమోదం అనంతరం ఆ నిర్ణయాన్ని గవర్నర్‌కు తెలియజేస్తారు. నూతన ముఖ్యమంత్రిగా డి.కె.శివకుమార్ ప్రమాణ స్వీకారం చేయడం లాంఛనమేనని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేస్తారన్న వార్తలను ఆయన వర్గం నేతలు, అనుచరులు జీర్ణించుకోలేకపోతున్నారు. దీనిపై స్పష్టత కోరుతూ ఆయన ఇంటికి పరుగులు పెట్టారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు సిద్ధరామయ్యను కలుసుకొని తదుపరి కార్యాచరణపై చర్చించారు. ప్రస్తుత పరిణామాలపై వారంతా ఆందోళన వ్యక్తం చేయగా, సిద్ధరామయ్య మాత్రం మౌనం వహించినట్లు సమాచారం. రాజీనామా చేయవద్దని బుజ్జగించే ప్రయత్నం చేసినప్పటికీ సిద్ధరామయ్య స్పందించకుండా మిన్నకుండిపోయారు. బుధవారం ఆయన 'ఎక్స్'లో చేసిన ట్వీట్ హాట్‌టాపిక్‌గా మారింది. సీఎంగా తన వీడ్కోలు సందేశాన్ని రాష్ట్ర ప్రజలకు ఇచ్చారు. కర్ణాటక ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తి చేసుకున్నట్లు, ఈ సమయంలో తమ ప్రభుత్వం గ్యారంటీ స్కీమ్ హామీలతో పాటు అనేక ప్రజాకర్షక పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. ఈ విజయాన్ని ప్రతి ఒక్క కన్నడిగుడికి అంకితం ఇస్తున్నామని వెల్లడించారు. ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదనే సంకల్పంతో అన్నభాగ్య పథకాన్ని తీసుకొచ్చినట్లు ఉద్ఘాటించారు.

### ప్రమాణ స్వీకారం ఏర్పాట్లు ఆరంభం

ప్రమాణ స్వీకార శుభ ముహూర్తం కోసం డి.కె.శివకుమార్ సన్నిహితులు ఇప్పటికే పురోహితులను సంప్రదించినట్లు తెలిసింది. శివకుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారీగా ఏర్పాట్లు ఆరంభమయ్యాయి. బెంగళూరు కంఠీరవ స్టేడియం లేదా విధానసౌధ ముందు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగే అవకాశం ఉంది. మరోవైపు సీఎం సిద్ధరామయ్య ఢిల్లీ పర్యటన ముగించుకుని మంగళవారం రాత్రి బెంగళూరుకు చేరుకోగా, డి.కె.శివకుమార్ మాత్రం బుధవారం కూడా అక్కడే మకాం వేశారు. గురువారం ఉదయం ఢిల్లీ నుంచి బెంగళూరుకు చేరుకొని, సిద్ధరామయ్య ఇచ్చే అల్పాహార విందులో ఆయన పాల్గొంటారు. సీఎం మార్పు నిర్ణయంపై కాంగ్రెస్ అధిష్టానం వెనక్కి తగ్గకుండా జాగ్రత్త పడేందుకు డి.కె.శివకుమార్‌ఢిల్లీలోనే ఉన్నట్లు తెలిసింది. ఈ నెల 30న ఆయన సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ప్రచారం సాగుతోంది.

## ప్రజల కోసం ప్రశ్నించే ఏకైక సింహం జగన్: కొడాలి నాని

వైసీపీ అధినేత జగన్ నేతృత్వంలో పార్టీ కీలక సమావేశం జరిగింది. అనంతరం మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాబోయే రోజుల్లో చంద్రబాబు రెండేళ్ల పాలనలోని వైఫల్యాలను, ప్రజలకు జరిగిన నష్టాలను ఎండగడతామని వారు స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడా ఏకగ్రీవాలు కాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి పోరాడాలని క్యాడర్‌కు కొడాలి నాని పిలుపునిచ్చారు. చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాలను ప్రజలంతా గమనిస్తున్నారని, లోకేశ్ ఒక్క శాఖను కూడా సరిగ్గా నడపలేకపోతున్నారని విమర్శించారు. దమ్ముంటే చంద్రబాబు జగన్‌తో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ప్రజల కోసం ప్రశ్నించే ఏకైక సింహం జగన్ అని, గుంపులుగా వచ్చేది వాళ్లేనని నాని ధ్వజమెత్తారు. పేర్ని నాని మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం 'సూపర్ సిక్స్' హామీలను తుంగలో తొక్కి, బాండ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు.

# మహానాడులో చరిత్రాత్మక తీర్మానం



చంద్రబాబు వివరించారు. రికార్డులు సృష్టించడం, వాటిని తిరిగి తిరగరాయడం టీడీపీకే సాధ్యమని మరోసారి నిరూపించామని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్త్రీ శక్తి, కార్యకర్తే అధినేత, యువగళం, పేదల సేవ వంటి కీలక తీర్మానాలపై చర్చించినట్లు తెలిపారు. మహానాడు వేదికగా తమ 23 నెలల పాలనను సమీక్షించుకున్నామని, భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకున్నామని చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు. వర్చువల్ విధానంలోనూ ఇంత భారీ స్థాయిలో కార్యకర్తలు పాల్గొనడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రారంభమైన మహానాడులో లోకేశ్ మాట్లాడారు. '2029 సార్వత్రిక ఎన్నికల్లో మహిళలకు 33 శాతం సీట్లను కేటాయించాలి. ఇది భారతదేశ భవిష్యత్తు పట్ల టీడీపీకి ఉన్న నిబద్ధత. మనకు మరింత మంది మహిళా చట్టసభ సభ్యులు కావాలి. మహిళా విధాన నిర్ణేతలు కావాలి. టీడీపీ భవిష్యత్తును మహిళలు భుజం భుజం కలిపి నడిపిస్తారు. ఇది మా సంకల్పం.. బాధ్యత.. కమిట్‌మెంట్' అని అన్నారు. భారత రాజకీయాల్లో తదుపరి శకం మహిళా నాయకత్వానిదే కావాలని తాను బలంగా విశ్వసిస్తున్నానని లోకేశ్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకురావడం ద్వారా ఎన్డీయే ఒక చరిత్రాత్మక అడుగు వేసిందన్నారు. 'మహిళలు కేవలం లబ్ధిదారులుగా మిగిలిపోకూడదు. నిర్ణయాలు తీసుకునేవారుగా మారాలి. దురదృష్టవశాత్తు ప్రతిపక్ష పార్టీలు మహిళా బిల్లును తిరస్కరించి, మహిళా సాధికారతకు అడ్డంకులు సృష్టించడానికి ప్రయత్నించాయి. ఎన్నికల సమయంలో చాలా పార్టీలు మహిళా సాధికారత గురించి మాట్లాడుతాయి. ఎన్నికల తర్వాత మహిళలను మర్చిపోతాయి. కానీ టీడీపీ ఆచరణలో మహిళా సాధికారతను విశ్వసిస్తోంది. మహిళలను అవమానపరిచే మాటలు ఎవరూ మాట్లాడకూడదు. దీనికోసం పోరాటం మన నుంచే మొదలుకావాలి' అని వివరించారు. 'టీడీపీలో కార్యకర్తే అధినేత. 2019 నుంచి 2024 వరకు పుసుపు సైన్యం చేసిన పోరాటం ఒక చరిత్ర. తోట చంద్రయ్య, అంజిరెడ్డి తాత, మంజుల, చెన్నుపాటి గాంధీ.. వీరంతా మనకు స్ఫూర్తి. మన అధినేతను 53 రోజులు అక్రమంగా అరెస్టు చేస్తే ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారంతా రోడ్లపైకి వచ్చారు. అది మన క్రెడిబిలిటీ' అని అన్నారు.

'కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఎవరూ ఇవ్వని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని.. అభివృద్ధి వికేంద్రీకరణ మన విధానం. దేశవ్యాప్తంగా వచ్చే పెట్టుబడుల్లో ఈ రోజు 25 శాతం ఏపీకి వస్తున్నాయి. నేను టీమ్11 కెప్టెన్ కు ఆఫర్ ఇస్తున్నా.. సమయం, తేదీ మీరు ఫిక్స్ చేయండి. సంక్షేమం, అభివృద్ధిపై చర్చకు నేను రెడీ. సైకో హయాంలో బీసీలు, దళితులు, మైనారిటీలపై జరిగిన దాడులను మనం మర్చిపోవద్దు' అని సూచించారు.

# మహారాష్ట్ర సీఎంకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ

**కేంద్రమంత్రితో ముఖ్యమంత్రి భేటీ**

కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్ గా భేటీ అయ్యారు. అమెండెడ్ భారత్ నెట్ ప్రోగ్రాం కింద తెలంగాణలో టీ–ఫైబర్ ప్రాజెక్టు అమలుపై చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి పలు కీలక అంశాలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు. ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి బలమైన హైస్పీడ్ ఇంటర్నెట్ అందించాలనే అంశంపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. అమెండెడ్ భారత్ నెట్ ప్రోగ్రాం అమలుకు సంబంధిత ఒప్పందాన్ని త్వరితగతిన కుదుర్చుకోవడం, పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదల వేగవంతం తదితర అంశాలపై చర్చించారు. మండలం నుంచి గ్రామ పంచాయతీ రింగ్ నెట్ వర్క్ ఆస్తులను డిజిటల్ భారత్ నిధికి బదిలీ చేసేందుకు స్పష్టమైన విధానం ఏర్పాటు చేయడంపై వారు చర్చించారు. తెలంగాణ విజ్ఞప్తులపై సింధియా సానుకూలంగా స్పందించారు. కేంద్రం సహకరిస్తుందని హామీ ఇచ్చారు.

## జూన్ 12న బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించనున్న సీఎం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో ఇంటర్ విద్యార్థులకు సంబంధించిన బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ ఈ ఏడాది నుంచి అమలు చేయనున్నారు. ఈ బ్రేక్ ఫాస్ట్ విధానానికి సంబంధించిన మెనూ విడుదలైంది. మెనూలో బోండా, దోశ, పూరీ, మిల్లెట్ ఇడ్లీ, ఉప్మా ఉన్నాయి. రోజుకో వంటకాన్ని విద్యార్థులకు ఇవ్వనున్నారు. జూన్ 12న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. విద్యార్థులకు సరైన పోషకాలు అందించేలా మెనూను రూపొందించారు. ఈ ఫలహారాలలోకి చట్నీ, సాంబార్, మిక్స్ వెజిటెబుల్ కుర్మా వంటివి అందించనున్నారు. ఇంటర్ విద్యార్థులకు బలవర్ధక ఆహారాన్ని అందించేందుకు ఈ బ్రేక్ ఫాస్ట్ విధానాన్ని ఈ సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నారు. ఈ పథకం కోసం ప్రతి సంవత్సరం రూ.120 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. బ్రేక్ ఫాస్ట్ పథకం కింద రాష్ట్రంలోని 1.92 లక్షలమంది ఇంటర్ విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు మాత్రమే మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయా రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారు. కానీ తెలంగాణలో ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు. మధ్యాహ్న భోజనంతో పాటు బ్రేక్ ఫాస్ట్ కూడా ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడంతో, దీనిని ఈ సంవత్సరం నుంచి అమలు చేయనున్నారు.

## కల్లాల వద్ద దైన్యంగా రైతులు

కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి, మొక్కజొన్న తదితర పంటలు తీవ్రంగా దెబ్బతినడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, రైతాంగానికి అండగా ఉండాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ఆపత్కాలంలో రైతన్నలకు భరోసా ఇవ్వాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలతో సహా రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు పలు మార్కెట్ యార్డుల్లో వడ్లు వర్షానికి కొట్టుకుపోతుంటే రైతన్నలు కన్నీరుమున్నీరు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు లేక సెల్‌ఫోన్‌ల వెలుతురులో రైతులు తమ ధాన్యాన్ని కాపాడుకోవడానికి పడుతున్న అవస్థలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ అసమర్థత, ముందుచూపు లేకపోవడం వల్లే నేడు రైతన్నలు ఈ దుస్థితిని ఎదుర్కొంటున్నారని, ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న తీవ్ర జాప్యం వల్లే రైతుల ఆరుగాలం కష్టం కళ్లముందే నీళ్లపాలవుతోందని ధ్వజమెత్తారు. ఈ కష్టకాలంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో రైతాంగానికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ శ్రేణులన్నీ క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని కేటీఆర్ సూచించారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తక్షణమే తమ తమ పరిధిలో అకాల వర్షాల వల్ల ప్రభావితమైన అన్ని మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని ఆదేశించారు. రైతుల పక్షాన నిలబడి ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా, రైతులకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచాలని దిశానిర్దేశం చేశారు. మార్కెట్ యార్డుల్లో తడిసిన వరి, మొక్కజొన్న తదితర ధాన్యాన్ని తేమ శాతం, తరుగు లాంటి ఎలాంటి సాకులు చెప్పకుండా బేషరతుగా కనీస మద్దతు ధరకు (ఓ-ఃూఖ) ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. వర్షాలకు పంట నష్టపోయిన రైతులందరికీ వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకో వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మొద్దునిద్ర వీడి, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## రైతుల ఆగ్రహంలో కాంగ్రెస్ కొట్టుకుపోతుంది

వనపర్తి: రైతులకు దుర్భర పరిస్థితులు కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం మట్టికొట్టుకుపోవడం ఖాయమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. బుధవారం బీఆర్ఎస్ శ్రేణులతో కలసి జిల్లాలోని పెద్దమందడి మండలంలో పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతలపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరిత చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమవడం రేవంత్ రెడ్డి చేతగానితనం, నిర్లక్ష్యమేనని ఆరోపించారు. రైతులకు ఉద్దేశపూర్వకంగానే సకాలంలో యూరియా ఇవ్వకుండా, కరెంట్ సరఫరాలో కోతలు పెడుతూ, కొనుగోలులో తీవ్ర జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులు విసిగిపోయి తమ ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటే, ప్రభుత్వంపై భారం పడకుండా ఉంటుందని రేవంత్ కుట్ర చేస్తున్నారని తీవ్రంగా ఆరోపించారు. నాడు కేసీఆర్ పంట చేతికి రాగానే వెంటనే ధాన్యం కొనుగోలు చేసి, వారం రోజుల్లోనే నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారని గుర్తు చేశారు. నేడు రేవంత్ తుగ్లక్ పాలనలో రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవడానికి నెలల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాయాల్సి వస్తోందని దుయ్యబట్టారు.

## పేల్చి పడేస్తాం..

లేదు ఆయన ఎప్పుడు ఎవరికి వార్నింగ్ ఇస్తారో.. ఎప్పుడు ఎవరితో కయ్యం పెట్టుకుంటారో చెప్పడం చాలా కష్టం. ఈ సారి ఆయన అమెరికా మిత్ర దేశమైన ఒమన్‌పై విరుచుకపడ్డారుఅమెరికాలో జరిగిన ఓసమావేశంలో అక్కడి జర్నలిస్టులు ఇరాన్, ఒమన్ కలిసి హర్ముజ్ నియంత్రించేలా తాత్కాలిక ఒప్పందాన్ని అంగీకరిస్తారా? అని ప్రశ్నించారు. దానికి ఆగ్రహం చెందిన ట్రంప్ "లేదు, ఆ జలసంధి అందరి కోసం తెరిచే ఉంటుంది. అది అంతర్జాతీయ జలభాగం. మిగతా అందరిలాగే ఒమన్ కూడా పద్ధతిగా ప్రవర్తించాలి, లేదంటే మేము వారిని పేల్చి పడేయాల్సి వస్తుంది. వారికి ఆ విషయం బాగా తెలుసు, అంతా సర్దుకుంటుంది," అని అన్నారు. అయితే ఈ వ్యాఖ్యలపై తదుపరి చిన్న వివాదం చెలరేగింది. ట్రంప్ నిజంగానే ఒమన్‌ని అన్నారా? లేక ఇరాన్‌కి బదులుగా పొరబాటున ఒమన్ పేరు వాడారా అన్నారా అని అనుమానాలు వ్యక్తమయ్యాయి. అనే విషయమై వివరణ ఇవ్వాల్సిందిగా అక్కడి మీడియా ప్రతినిధులు వైట్‌హౌస్‌నను కోరినటప్పటికీ వారు స్పందించనట్లు తెలుస్తోంది.

## బండి భగీరథ్‌కు మేడ్చల్ లో వైద్య పరీక్షలు



ఈ కేసుకు సంబంధించి దర్యాప్తును కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం పర్యవేక్షిస్తోంది. ఈ కేసులో మరిన్ని కీలక వివరాలు, సాక్ష్యాలను రాబట్టేందుకు నిందితుడిని తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పోలీసుల విజ్ఞప్తిని పరిశీలించిన మేడ్చల్–మల్కాజిగిరి పోక్సో కోర్టు మంగళవారం నిందితుడిని మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

**కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్య పరీక్షలు :** న్యాయస్థానం అనుమతితో పోలీసులు బండి భగీరథ్‌ను బుధవారం తమ కస్టడీలోకి తీసుకున్నారు. ఇందులో భాగంగా బుధవారం మధ్యాహ్నం సమయంలో నిందితుడిని కట్టుదిట్టమైన భద్రత మధ్య మేడ్చల్ పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ మూడు రోజుల కస్టడీలో కేసు నిరూపణకు అవసరమైన మరిన్ని కీలకమైన ఆధారాలను సేకరించాలని పోలీసులు ప్రయత్నం ముమ్మరం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

# గంటపాటు ప్రకృతి బీభత్సం: కుదేలైన రాజాపేట

- ఈదురు గాలులతో భారీ వర్షం.. రూ. 2 కోట్లకు పైగా నష్టం
- కల్లాల్లో తడిసిన 50 వేల ధాన్యపు బస్తాలు.. నేలరాలిన మామిడి
- కూలిన విద్యుత్ స్తంభాలు, విరిగిన చెట్లు.. అంధకారంలో గ్రామాలు

**తొలివెలుగు, రాజాపేట:**
మండలంలో మంగళవారం రాత్రి ప్రకృతి ఒక్కసారిగా కన్నెర్ర జేసింది. రాత్రి 10 గంటల నుంచి 11 గంటల వరకు గంటపాటు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ఈ అకాల వర్షం వరి, మామిడి సాగు చేసిన అన్నదాతలతో పాటు పాడి రైతులకు కోలుకోలేని దెబ్బ తీసింది. ప్రాథమిక అంచనాల ప్రకారం మండలం వ్యాప్తంగా సుమారు రెండు కోట్ల రూపాయలకు పైగా ఆర్థిక నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. వందలాది చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో రవాణా, విద్యుత్ వ్యవస్థలు పూర్తిగా స్తంభించిపోయాయి.

**కల్లాల్లో ముద్దయిన వరి.. కన్నీరు పెడుతున్న అన్నదాత:** మండలంలోని వివిధ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు విక్రయానికి తెచ్చిన సుమారు 1,000 ధాన్యం రాశులు, ఇప్పటికే నింపిన 50 వేల ధాన్యం బస్తాలు వర్షపు నీటిలో తడిసి ముద్దయ్యాయి. అధికారులు కొనుగోళ్లలో చేసిన జాప్యమే తమను ముంచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మండలంలోని దాదాపు 25 తోటల్లోని మామిడి కాయలు ఈదురు గాలుల ధాటికి నేలరాలాయి. ఒక్క మామిడి రైతులకు రూ. కోటికి పైగా నష్టం వాటిల్లింది. నర్సాపురం రెవెన్యూ పరిధిలోని నమిల శ్రీహరి అనే రైతుకు చెందిన 5 ఎకరాల మామిడి తోటలోని కాయలన్నీ రాలిపోయాయి. నేలపై మామిడి కాయలు పరిచినట్లుగా రాలిపోవడంతో సదరు రైతు కంటనీరు పెట్టుకున్న వైనం పలువురిని కలచివేసింది.






**స్తంభించిన జనజీవనం.. కదలని అధికారులు:** భారీ గాలుల ధాటికి వందకు పైగా చెట్లు విరిగి రోడ్లపై, వాహనాలపై పడ్డాయి. కొన్నిచోట్ల ఇళ్లపై ఉన్న రేకులు ఎగిరిపోయాయి. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. కనీసం 24 గంటలు శ్రమిస్తే తప్ప విద్యుత్ పునరుద్ధరణ జరిగే పరిస్థితి కనిపించడం లేదు. ఇంతటి బీభత్సం జరిగినా వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు రాకపోవడంపై రైతాంగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. తక్షణమే నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని, ఐకేపీ కేంద్రాల్లోని తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.



## ఉపాధి హామీ కొత్త నిబంధనలతో కూలీల కష్టాలు

- హాజరు నమోదులో సాంకేతిక ఇబ్బందులు
- పాత పద్ధతినే కొనసాగించాలి: వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

**తొలివెలుగు, రాజాపేట:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త నిబంధనలు కూలీలకు శాపంగా మారాయని రాజాపేట మండల వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కట్ట రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పారుపల్లి గ్రామంలో మంగళవారం ఆయన ఉపాధి కూలీలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం కట్ట రవికుమార్ మాట్లాడుతూ.. గతంలో ఉన్న చట్టం ద్వారా ఉపాధి కూలీలకు అన్ని రకాల సౌకర్యాలు, లబ్ధి చేకూరే పరిస్థితి ఉండేదన్నారు. అయితే, కొత్తగా ప్రవేశపెట్టిన నిబంధనల ప్రకారం రోజుకు రెండుసార్లు (ఉదయం, మధ్యాహ్నం 4 గంటలకు) మొబైల్ యాప్ ద్వారా ఫేస్ ఫోటో, బయోమెట్రిక్ హాజరు తీసుకోవడం కూలీలకు పెద్ద శాపంగా మారిందని విమర్శించారు. చేతి వేలిముద్రలు అరగడం, నెట్‌వర్క్ సమస్యలు, సాంకేతిక లోపాల వల్ల చాలా మంది కూలీలకు ఫేస్ రికగ్నిషన్ (ముఖ గుర్తింపు) కావడం లేదని, దీనివల్ల రోజంతా కష్టపడినా హాజరు పడక వేతనాలు కోల్పోవాల్సి వస్తోందని ధ్వజమెత్తారు. జీవీబీ రాంజీ చట్టం/నిబంధనల ద్వారా కూలీల ఉపాధి దెబ్బతింటోందని, ఈ కొత్త విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పాత పద్ధతిలోనే ఉపాధి హామీ పనులను కొనసాగించాలని, అధికారులు తక్షణమే గ్రామాలను సందర్శించి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు లలిత, రాగుల బాలరాజు, బండారి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు

## పిడుగుపాటుకు పాడిగేదె మృతి.. కుదేలైన రైతు కుటుంబం!

- ముల్లగూడెంలో ముర్రా జాతి గేదె మృత్యువాత
- మరోచోట ఇల్లు ధ్వంసం.. బాధిత

**కుటుంబాలను ఆదుకోవాలి: సర్పంచ్ బాలరాజు రెడ్డి**



**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని ముల్లగూడెం గ్రామంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తోడు పిడుగుపాటు కలకలం రేపింది. గ్రామానికి చెందిన రైతు గొడుగు కనకయ్యకు చెందిన ముర్రా జాతి పాడిగేదె పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ సుమారు రూ. 80,000 ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. పాడి గేదె మృతితో ఆ కుటుంబం ప్రధాన జీవనాధారాన్ని కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందుల్లో పడింది. అదే గ్రామానికి చెందిన పరిష ఐలయ్య అనే వ్యక్తి ఇంటిపై కూడా పిడుగు పడింది. పిడుగుపాటు ధాటికి ఇంటి స్లాబ్ పెచ్చులు ఊడిపోయి కిందపడ్డాయి. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం సంభవించకపోవడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలపై ముల్లగూడెం సర్పంచ్ జన్నపల్లి బాలరాజు రెడ్డి స్పందించారు. పిడుగుపాటు వల్ల నష్టపోయిన రైతు కనకయ్య కుటుంబానికి, ఇల్లు దెబ్బతిన్న ఐలయ్యకు ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఆర్థిక సహాయం అందజేత



**తొలివెలుగు, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన రవ్వ శ్రవణ్ కుమార్ (35) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ ఈడెం రాధా శ్రీనివాస్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5,000 నగదు సహాయం తో పాటు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఈడెం రాధా శ్రీనివాస్ మాట్లాడుతూ.. శ్రవణ్ కుమార్ కుటుంబానికి భవిష్యత్తులో అన్ని విధాలుగా అండదండగా ఉంటామని తెలిపారు. గ్రామ ప్రజలు కూడా బాధిత కుటుంబానికి తోడ్పాటును అందించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పున్న వెంకటేశం, కార్యదర్శి పిట్ట మహేందర్ రెడ్డి, వార్డు సభ్యులు మిరియాల జగన్నాథం, పాశం దీక్షిత్, ఠాకూర్ రమేష్ సింగ్, గంజి రంగయ్య, గూడెల్లి దామోదర్, నన్నూరి రవీందర్, కర్రే రాజు, మిరియాల రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రపాలనగరంలో నిలిచిన ధాన్యం రవాణా: లారీల కోసం రైతుల నిరీక్షణ

- ఇంద్రపాలనగరం కేంద్రాల్లో నిలిచిన వడ్ల రవాణా
- అధికారులు ఫోన్లు ఎత్తరు.. మిల్లర్లు లారీలు పంపరు
- రైతులతో కలిసి మిల్లు బాట పట్టిన సర్పంచ్ విక్రమ్



**తొలివెలుగు, రామన్నపేట:** మండల పరిధిలోని ఇంద్రపాలనగరం గ్రామంలో ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తూకం వేసి సిద్ధంగా ఉంచిన ధాన్యపు బస్తాలను వెంటనే మిల్లులకు తరలించి, దిగుమతి చేసుకోవాలని గ్రామ సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ అధికారులను, మిల్లర్లను కోరారు. అకాల వర్షాల నేపథ్యంలో బుధవారం ఆయన ఇంద్రపాలనగరంలోని కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల వద్ద ఎదురుచూస్తున్న రైతులు తమ సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రాలలో సుమారు ఆరు వేలకు పైగా ధాన్యపు బస్తాలు తూకం వేసి సిద్ధంగా ఉన్నప్పటికీ, మిల్లుల నుంచి లారీలు రాకపోవడంతో రవాణా నిలిచిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆకాశం మబ్బు పట్టి ఉన్నందున, ఏ క్షణంలోనైనా అకాల వర్షం కురిస్తే ధాన్యం తడిసి మొలకెత్తి తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందారు. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సంప్రదించే ప్రయత్నం చేసినా వారి నుంచి ఎలాంటి స్పందన లేదని, తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. రైతుల సమస్యలను విన్న సర్పంచ్ గర్ధాసు విక్రమ్ తక్షణమే స్పందించారు. ఆయన స్థానిక రైతులతో కలిసి నేరుగా 'విద్య ఆగ్రో మిల్లు'ను సందర్శించి, మిల్లు నిర్వాహకులతో అత్యవసరంగా చర్చలు జరిపారు. కొగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు వెంటనే లారీలను పంపాలని కోరారు. అన్నదాతలను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయకుండా కొనుగోలు ప్రక్రియను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేయాలని మిల్లర్లకు, పౌరసరఫరాల శాఖ అధికారులకు సూచించారు.



## ధాన్యం కొనుగోళ్లలో జాప్యమేల?: బీజేపీ జిల్లా అధ్యక్షుడు అశోక్ గౌడ్

- రాజాపేటలో ఐకేపీ కేంద్రాన్ని పరిశీలించిన బీజేపీ బృందం
- రెండు రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేయకుంటే ఆందోళన



**తొలివెలుగు, రాజాపేట:** మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం బీజేపీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఊట్కూరు అశోక్ గౌడ్ పార్టీ నాయకులతో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంపై కేంద్రం వద్దే రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లు సకాలంలో సాగకపోవడం వల్లే ఆకస్మిక వర్షాలకు ధాన్యం తడిసిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని చూసి చలించిపోయిన ఆయన, తక్షణమే జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. తడిసిన ప్రతి గింజనూ తరుగు లేకుండా కొనుగోలు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ.. ఎండనక, వాననక కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద వారాల తరబడి నిరీక్షించాల్సి రావడం దురదృష్టకరమన్నారు. రెండు రోజుల్లోగా మండలంలోని ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి పూర్తి చేయకపోతే, రైతుల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాజాపేట మండల అధ్యక్షుడు మేకల రమేష్, పార్టీ నాయకులు సాధనబోయిన శెంకర్, కుమ్మరి లక్ష్మణ్, దాచేపల్లి శ్రీనివాస్, గాండ్ల నర్సింగరావు, చిగుల్లా బీరయ్య, మార్క శివ, సోమసాని చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతన్నల మధ్య వివాహ దినోత్సవ వేడుకలు

- రైతులు, హమాలీలకు మజ్జిగ పంపిణీ చేసిన జయశ్రీ, జగదీశ్వర్లు
- మూడు కొనుగోలు కేంద్రాల్లో సేవా కార్యక్రమాలు
- కోతుల సమస్యపై పోరాటం ఆపను: జగదీశ్వర్

**తొలివెలుగు, రాజాపేట:**
రాజాపేటకు చెందిన సామాజిక చైతన్య వేదిక కన్వీనర్ మార్త జయశ్రీ, జగదీశ్వర్ దంపతులు తమ వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అన్నదాతల మధ్య గడిపి ఆదర్శంగా నిలిచారు. రేణిగుంట, రాజాపేట, నరసాపురం గ్రామాల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కల్లాల్లో ఎండకు ఎండుతున్న రైతులు, హమాలీలకు వారు స్వయంగా



మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ.. నిత్యం కష్టపడే అన్నదాతల శ్రేయస్సు కోసం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. తన తండ్రి మార్త వాసుదేవ్ ఆశయ సాధన కోసం, తల్లి సిద్ధమ్మ, అన్న వెంకటేశంల ప్రోత్సాహంతో ఈ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. అలాగే, ప్రాంతంలో పట్టిపీడిస్తున్న కోతుల సమస్యపై ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో పాటు స్థానిక తహసిల్దార్, ఎంపీడీవో, ప్రముఖ కవి సిద్ధారెడ్డిలకు వినతిపత్రాలు అందజేశామని, సమస్య పరిష్కారమయ్యే వరకు సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రేణిగుంటకు చెందిన బూర్గు నర్సిరెడ్డి సదరు దంపతులను చేనేత శాలువాతో సత్కరించి పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు, స్థానికులు పాల్గొని దంపతుల సేవలను అభినందించారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- జాయింట్ కలెక్టర్ వెంకారెడ్డికి రైతు సంఘం వినతి
- వారంలో ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్

**తొలివెలుగు, రామన్నపేట:**
మండల వ్యాప్తంగా మందకొడిగా సాగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను వెంటనే వేగవంతం చేసి, వారం రోజుల్లోగా పూర్తి చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య డిమాండ్ చేశారు. బుధవారం ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిమిత్తం రామన్నపేటకు వచ్చిన రెవెన్యూ జాయింట్ కలెక్టర్ వెంకారెడ్డికి రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించి, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. ఈ సందర్భంగా మేక అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. రామన్నపేట మండలంలో ఇంకా సుమారు 3 లక్షల క్వింటాళ్ల ధాన్యం నిల్వలు పేరుకుపోయి ఉన్నాయన్నారు. రోహిణి కార్తె ప్రారంభం కావడంతో రైతులు ఇప్పటికే సాగు పనుల కింద దున్నకాలు ప్రారంభించారని, అయితే గత రెండు నెలలుగా కొనుగోళ్లు నత్తనడకన సాగడం వల్ల అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు రైస్ మిల్లర్లు తాలు, తరుగు పేరిట రకరకాల కొర్రీలు పెడుతూ రైతులను వేధిస్తున్నారని మండిపడ్డారు. యుద్ధప్రాతిపదికన ధాన్యం సేకరించాలని, ప్రతి ఐకేపీ కేంద్రానికి కనీసం ఐదు లారీల చొప్పున అందుబాటులో ఉంచి గోదాములకు తరలించేలా చర్యలు తీసుకోవాలని జేసీని కోరారు. ఇప్పటికే ఈదురుగాలులు, అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసి మొలకెత్తే ప్రమాదం ఉందని, అధికారులు తక్షణమే స్పందించకపోతే



రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యుడు బల్గురి అంజయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి గన్నేబోయిన విజయభాస్కర్, వ్యకాస మండల అధ్యక్షుడు మేడి ముకుంద, నాగటి లక్ష్మణ్, మార్త భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం నిల్వలకు గోదాముల పరిశీలన

- రైతన్నలకు ఇబ్బంది లేకుండా త్వరలోనే కొనుగోళ్లు
- ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య హామీ
- ధర్మోజిగూడెంలో కొనుగోలు కేంద్రం తనిఖీ

**తొలివెలుగు, చౌటుప్పల్:**
మండల వ్యాప్తంగా రైతుల నుంచి సేకరించే ధాన్యాన్ని భద్రపరిచేందుకు అవసరమైన గోదాముల సౌకర్యాలపై చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ప్రత్యేక దృష్టి సారించింది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య ఆధ్వర్యంలో బుధవారం మండలంలో విస్తృతంగా పర్యటించి గోదాములను పరిశీలించారు. చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం పరిధిలోని రెండు పెద్ద గోదాములను కాంగ్రెస్ పార్టీ మునుగోడు ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్, గ్రామ సర్పంచ్ జువ్వి నరసింహలతో కలిసి వారు నిశితంగా తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా సందర్శించారు. ఈ సందర్భంగా




ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ.. ధర్మోజిగూడెం పరిధిలోని రెండు గోదాములు ధాన్యం నిల్వ చేయడానికి అన్ని విధాలా అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్నారు. నిల్వ సామర్థ్యం, రక్షణ చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని, అతి త్వరలోనే ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. గాలివానల నేపథ్యంలో ధాన్యం పాడవకుండా ముందస్తుగా గోదాములను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుండు మల్లయ్య గౌడ్, బత్తుల శ్రీహరి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాచకొండ భార్గవ్, యువజన కాంగ్రెస్ నాయకుడు ఊదరి రవి, కొంతం బుచ్చిరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



## ఘనంగా నెహ్రూ వర్ధంతి వేడుకలు

**- ఆదర్శప్రాయుడు తొలి ప్రధాని: కాంగ్రెస్ నాయకులు**

**- రాజాపేటలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు**

**తొలివెలుగు, రాజాపేట:** మండల కేంద్రంలో బుధవారం భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక నెహ్రూ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నమిల మహేందర్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని, విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేందర్ గౌడ్ మాట్లాడుతూ.. స్వతంత్ర భారతదేశ తొలి ప్రధానిగా దేశ నవనిర్మాణానికి నెహ్రూ వేసిన పునాదులు చిరస్మరణీయమన్నారు. ఆధునిక భారతదేశ శిల్పిగా ఆయన ప్రజలకు, దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాజాపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐరేని నవీన్ కుమార్, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాడోత్ విఠల్ నాయక్, ఉపసర్పంచ్ నమిల కేదారి గౌడ్, డాక్టర్ చింతల రవి, కొత్తజాల పండరి, రేణిగుంట సిద్ధులు, పొట్టబత్తిని వెంకటేష్, గొల్లెన ఐలయ్య, జయరాములు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుతో ఎద్దు మృతి: పంచనామా నిర్వహించిన వైద్యాధికారి

**- జనంపల్లిలో రైతు ఎర్రయ్యకు అకాల నష్టం**

**- ప్రభుత్వ సాయం అందేలా చూస్తామన్న ఏడీ డాక్టర్ ఇందిర**



**తొలివెలుగు, రామన్నపేట:** మండల పరిధిలోని జనంపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి తోడు పిడుగుపాటుకు గురై ఓ ఎద్దు మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు పోషబోయిన ఎర్రయ్యకు చెందిన ఎద్దు మేత మేస్తుండగా ఒక్కసారిగా పిడుగు పడటంతో అది అక్కడికక్కడే మరణించింది. సమాచారం అందుకున్న రామన్నపేట పశువైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) డాక్టర్ ఇందిరా బుధవారం తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. చనిపోయిన ఎద్దుకు డాక్టర్ ఇందిరా ఆధ్వర్యంలో పశువైద్య సిబ్బంది పంచనామా (పోస్టుమార్టం) నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ.. మృతి చెందిన ఎద్దుకు సుమారు ఆరు సంవత్సరాల వయసు ఉంటుందని ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. పంచనామా నివేదిక ప్రకారం పిడుగుపాటు వల్లే ఎద్దు మరణించినట్లు నిర్ధారణ అయిందన్నారు. బాధితుడైన నిరుపేద రైతు ఎర్రయ్యకు ప్రభుత్వం నుంచి తగిన ఆర్థిక సహాయం అందేలా చూస్తామని, ఇందుకు సంబంధించిన పశువైద్య నివేదికను రెవెన్యూ అధికారులకు బదిలీ చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, రైతులు గోగు వెంకన్న, మేడబోయిన కృష్ణ, పోషబోయిన నరసింహ, బాధితుడు పోషబోయిన ఎర్రయ్య పాల్గొన్నారు.

## మృత్యు కుహరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్.. పాడిగేదె బలి!

**- చెరువు కట్ట పక్కనే ఘోరం.. రూ. 80 వేల నష్టం**

**- కన్నీరుమున్నీరవుతున్న బాధిత రైతు అబ్దుల్ కాళిక్ కుటుంబం**

**తొలివెలుగు, అడ్డగూడూరు:** మండల కేంద్రంలో విద్యుత్ తీగలు తగిలి ఓ పాడిగేదె అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరుకు చెందిన రైతు ఎండి అబ్దుల్ కాళిక్ (తండ్రి ఎండి అఫ్జల్) పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం మండల కేంద్రంలోని పెద్ద చెరువు కట్ట పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో గేదె మేత మేస్తోంది. అయితే, అక్కడ కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు లేదా ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణాన్ని గేదె ప్రమాదవశాత్తూ తాకడంతో ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురైంది. తీవ్రమైన విద్యుత్ షాక్ ధాటికి ఆ పాడిగేదె అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. ఈ ప్రమాదంపై బాధిత రైతు అబ్దుల్ కాళిక్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. మృతి చెందిన పాడిగేదె విలువ సుమారు రూ. 80,000 ఉంటుందని, తన కుటుంబానికి అదే ప్రధాన జీవనాధారమని కన్నీరుమున్నీరయ్యాడు. సాగు పనుల వేళ, పాడి ద్వారా వచ్చే ఆదాయం నిలిచిపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో పడ్డామని వాపోయాడు. ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, క్షేత్రస్థాయి పరిశీలన జరిపి తమకు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు. చెరువు కట్ట పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణ వేలికలు (ఫెన్సింగ్) ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



## ప్రకృతి కన్నెర్ర.. నర్సాపురం కకావికలం!

**- గ్రామంలో విరిగిపడ్డ 20 విద్యుత్ స్తంభాలు, పదికి పైగా చెట్లు**

**- రోడ్లపై నిలిచిన రవాణా.. రంగంలోకి జేసీబీలు**

**- సర్పంచ్ ఎమ్మ శిరీష నాగరాజు ఆధ్వర్యంలో ముమ్మరంగా సహాయక చర్యలు**

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలో మంగళవారం రాత్రి కురిసిన గాలివాన అపూర్వ నష్టాన్ని మిగిల్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా గంటపాటు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడటంతో గ్రామం అతలాకుతలమైంది. ఈ విపత్తు ధాటికి గ్రామంలో ఏకంగా 20 విద్యుత్ స్తంభాలు నేలకూలగా, పదికి పైగా పెద్ద పెద్ద చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. దీంతో రవాణా వ్యవస్థ స్తంభించడమే కాకుండా, పరిసర తోటల్లోని మామిడి కాయలు నేలరాలి రైతులకు భారీ నష్టం వాటిల్లింది.

**యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు:**
బుధవారం ఉదయం నుంచే నర్సాపురం గ్రామ సర్పంచ్ ఎమ్మ శిరీష నాగరాజు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ



కార్యదర్శి, గ్రామ పెద్దలు, యువకులు కలిసి రంగంలోకి దిగి దిద్దుబాటు చర్యలు చేపట్టారు. సర్పంచ్ తక్షణమే స్పందించి విద్యుత్, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులకు సమాచారం అందించడంతో యంత్రాంగం కదిలింది. రోడ్డుపై అడ్డంగా పడిన చెట్లను జేసీబీ యంత్రాల సహాయంతో ముక్కలుగా కోసి పక్కకు తొలగించారు. దీంతో వాహనాల రాకపోకలు పునరుద్ధరించబడ్డాయి.

**12 గంటల్లో విద్యుత్ పునరుద్ధరణే లక్ష్యం:**
విరిగిపోయిన 20 విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను



నాటేందుకు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పనులను ముమ్మరం చేశారు. రాబోయే 12 గంటల్లో గ్రామానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేలా ప్రత్యేక కార్యాచరణతో శ్రమిస్తున్నారు. సర్పంచ్ బృందం ఉదయం నుంచి రాత్రి వరకు క్షేత్రస్థాయిలోనే ఉండి పనులను పర్యవేక్షించడంతో సహాయక చర్యలు వేగవంతమయ్యాయి. రాజకీయాలకతీతంగా ఇతర పార్టీల నాయకులు సైతం గ్రామ పంచాయతీ పాలకవర్గం తీసుకున్న తక్షణ చర్యలను అభినందించారు. విపత్కర సమయంలో దగ్గరుండి సేవలు అందించిన సర్పంచ్ బృందాన్ని పరిసర గ్రామాల ప్రజలు సైతం ప్రశంసించారు.

## పాఠశాలలో సీసీ కెమెరాల చోరీ!

**- పులిగిల్లలో దుండగుల ఘాతుకం**

**- ఆకతాయిలు, గంజాయి ముఠాల పనేనని గ్రామస్థుల అనుమానం - చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**

**తొలివెలుగు, ?వలిగొండ:**
నేరాల అదుపునకు, దొంగలను గుర్తించేందుకు రక్షణగా నిలిచే సీసీ కెమెరాలనే దుండగులు ఎత్తుకెళ్లిన వింత ఘటన మండల పరిధిలోని పులిగిల్ల గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పులిగిల్లలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల భద్రతను కాంక్షిస్తూ, పాఠశాల ఆస్తుల రక్షణ కోసం గత కొన్ని నెలల క్రితం ఒక దాత ఆర్థిక సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే, పాఠశాల ఆవరణలో నిఘా పెరగడాన్ని సహించలేని కొందరు దుండగులు ఏకంగా ఆ కెమెరాలనే దొంగిలించడం స్థానికంగా కలకలం రేపింది.

**నిఘా నీడను తట్టుకోలేకేనా..?**
పాఠశాల ఆవరణలో సీసీ కెమెరాల నిఘా ఉండటం వల్ల రాత్రి వేళల్లో అక్కడ సంచరించే ఆకతాయిలకు, గంజాయి వంటి వ్యసనాలకు బానిసలైన వారికి ఇబ్బందిగా మారిందని



గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కెమెరాలు ఉంటే తమ ఆగడాలు సాగవనే ఉద్దేశంతోనే, వాటిని తొలగిస్తే తమ పనులు సజావుగా చేసుకోవచ్చనే అపోహతో దుండగులు ఈ చోరీకి పాల్పడి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు.

**చర్యలు తీసుకోవాలి:**
ఇటీవల కాలంలో దొంగలు, విద్రోహ శక్తులు విద్యా బుద్ధులు నేర్పే బడిని, ఆధ్యాత్మిక నిలయాలైన గుడులను సైతం వదలకుండా అసాంఘిక కార్యకలాపాలకు తెగబడుతుండటంపై



ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే పోలీసులు వెంటనే స్పందించి, దర్యాప్తు చేపట్టి సీసీ కెమెరాలను దొంగిలించిన వారిని పట్టుకుని చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పులిగిల్ల గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే దేశ ప్రగతి!

**- ఘనంగా ఉచిత టైలరింగ్ శిక్షణ సర్టిఫికెట్ల ప్రదానం**

**- లయన్స్ క్లబ్, రామానందతీర్థ సంస్థల సేవలు అమోఘం**

**- చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ పావని రమేష్ గౌడ్**

**తొలివెలుగు, చౌటుప్పల్:** మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగినప్పుడే కుటుంబంతో పాటు సమాజం కూడా ప్రగతి సాధిస్తుందని చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ చైర్మన్ కిషన్ రెడ్డి పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ సహకారంతో నిర్వహించిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ విజయవంతంగా పూర్తయింది. ఈ సందర్భంగా బుధవారం వలిగొండ రోడ్డులోని లయన్స్ భవన్‌లో ట్రస్ట్ చైర్మన్ దాచేపల్లి ప్రకాష్ గుప్తా అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన మున్సిపల్ చైర్మన్ పావని, రామానందతీర్థ సంస్థ చైర్మన్ కిషన్ రెడ్డిలు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు.

**స్వయంశక్తితో ఎదగాలి:**
ఈ సందర్భంగా రామానందతీర్థ సంస్థ చైర్మన్ కిషన్ రెడ్డి




మాట్లాడుతూ.. మహిళలు ఎవరిపైనా ఆధారపడకుండా తమ కాళ్లపై తాము నిలబడేందుకు ఈ టైలరింగ్ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. మహిళా సాధికారతను కాంక్షించి ఉచితంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఆధునిక సమాజంలో స్త్రీలు అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా దూసుకుపోతున్నారని కొనియాడారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. చౌటుప్పల్‌లోని పేద, మధ్యతరగతి



ప్రజల కోసం లయన్స్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు.
ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ పోలోజు శ్రీనివాస్ చారి, క్లబ్ అధ్యక్షుడు తిరందాసు జగన్నాథ్, ట్రస్ట్ ట్రెజరర్ గోశిక కరుణాకర్, శిక్షకురాలు బాల భారతి, కార్యదర్శి ఎండి. అతహర్ పాషా, కోశాధికారి సిలివేరు మంగయ్య, కొసనం రాంరెడ్డి, కాసుల వెంకటేశం, పోలోజు రాజు, చింతల ప్రభాకర్ రెడ్డి, దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, దాచేపల్లి రాజు మరియు శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.

## రేపల్లెలో పసుపు పండుగ: ఉత్సాహంగా 'మహానాడు'







**- పసుపు వర్ణమయమైన పట్టణం... టీడీపీ శ్రేణుల్లో ఉరకలెత్తిన జోష్**

**- మంత్రి అనగాని సారథ్యంలో విజయవంతమైన సభ**

**- కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన చంద్రబాబు, లోకేష్**

**తొలివెలుగు, రేపల్లె:** తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు-2026 కార్యక్రమాలు రేపల్లె పట్టణంలో బుధవారం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. పార్టీ శ్రేణుల జోష్, నినాదాలతో పట్టణం మొత్తం పసుపు వర్ణంతో కళకళలాడింది. రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ సారథ్యంలో, సీనియర్ నేత అనగాని శివప్రసాద్ నేతృత్వంలో రేపల్లె టౌన్ క్లస్టర్-1, 2 పరిధిలోని మహానాడు కార్యక్రమాలను స్థానిక వీరవల్లి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9 గంటలకు ప్రారంభించారు.

**ఎన్టీఆర్‌కు ఘన నివాళి:**
కార్యక్రమ ప్రారంభానికి ముందు.. పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు విగ్రహానికి బాపట్ల పార్లమెంట్ సభ్యుడు తెన్నేటి కృష్ణ ప్రసాద్, మాజీ ఎంపీ మోపిదేవి వెంకటరమణ రావు, అనగాని శివప్రసాద్, మహానాడు పరిశీలకురాలు అన్నాబత్తుని జయలక్ష్మి, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధర్, దేవస్థానం రాష్ట్ర బోర్డు డైరెక్టర్ జీవీ నాగేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాలను అధికారికంగా ప్రారంభించారు.

**ప్రభుత్వ సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి:**
సభ ప్రాంగణంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అందించిన ప్రత్యేక సందేశాల వీడియోలను కార్యకర్తల కోసం ప్రదర్శించారు. ఈ సందర్భంగా వేదికపై ఉన్న నేతలు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా చేరవేయడంలో పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు పారదర్శక సేవలు అందించడంలో ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి కార్యకర్తలు సహకరించాలని సూచించారు.
ఈ మహానాడు సభ ప్రాంగణం కూటమి శ్రేణుల సందడితో కిక్కిరిసిపోయింది. రేపల్లె పట్టణ టీడీపీ కార్యవర్గ సభ్యులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, వార్డు కమిటీలు, జిల్లా, రాష్ట్ర



కమిటీ సభ్యులు, మాజీ కౌన్సిలర్లు, క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్ బూత్ ఇన్‌చార్జులు, కుటుంబ సాధికార సారథులు, ఏఎంసీ సభ్యులు, నీటి సంఘాల ప్రతినిధులు, దేవాలయ కమిటీ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొని మహానాడును విజయవంతం చేశారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ పనితీరు, భవిష్యత్ కార్యాచరణపై చర్చలు సాగిన ఈ మహానాడు కార్యక్రమం టీడీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని నాయకులు పేర్కొన్నారు.